# ప్రజాశక్తి

గురువారం 11 ఏప్రిల్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి




# నగరంలో.. తాగునీటి కష్టాలు

- ఎండిపోతున్న భూగర్భ జలాలు
- విశాఖకు అవసరమైన నీటి విడుదలపైనా అనుమానాలు
- పలుచోట్ల సరఫరా కాకపోవడంతో జనం అవస్థలు

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

అంతటా 2024 ఎన్నికల కోలాహాలం. రాజకీయ పార్టీలు వారి వారి అభ్యర్థుల ప్రచారాల్లో మునిగితేలుతున్నాయి. ఇదిలా ఉండగా మరోవైపు విశాఖలో నీటి కష్టాలు మొదలయ్యాయి. ఎండల తీవ్రత ఓ వైపు.. నీటిసరఫరా అవస్థలు మరోవైపు కాలనీలు, మురికివాడలు, కొన్ని ప్రాంతాల్లో ప్రజలను కాసింత ఇబ్బందికి గురిచేస్తున్నాయని చెప్పక తప్పదు. నగరంలోని అక్కయ్యపాలెం, నర్సింహనగర్, శ్రీనివాస్‌నగర్, రామచంద్రనగర్ వంటి చోట్ల, మాధవదార 50వ వార్డు తెన్నేటినగర్ ప్రాంతంలోనూ, 51వ వార్డు కొండవాలు ప్రాంతాల్లోనూ తాగునీటికి కటకట మొదలైంది. పైన తెలిపిన అన్నిచోట్లా 2 లేదా 3 రోజులకోసారి నీటిసరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా నగరంలో పలు ఏరియాల్లో మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) వాటర్ వర్క్స్ అధికారులు, ఉద్యోగులు వెల్లడిస్తున్న వివరాల ప్రకారం గోస్తనీ రివర్ వద్ద కొన్నిసందర్భాల్లోలో ఓల్టేజీ సమస్యలు, పవర్ ఫెయిల్యూర్‌లు ఉండడంతో ఒక ప్రాంతంలో సప్లయ్ కొంతమేర ఆగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఇది నిరంతరాయంగా ఉండే అవకాశాల్లేవని కొద్ది గంటల్లో సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపారు. వాస్తవానికి ఈ నెల 8, 9 తేదీల్లో సాగర్‌నగర్ ఎండాడ పరిసరాల్లో తాగు నీటికి జనం కొన్ని ఏరియాల్లో కటకటలాడారు. ఎట్టకేలకు 10వ తేదీన ఉదయం 9గంటల సమయంలో నీటిని విడుదల చేసినప్పటికీ 20 నిమిషాలకు మించి రాకపోవడంతో ఇళ్లపై ట్యాంకుల్లో తడి చేరలేదంటూ ప్రజలు వ్యాఖ్యానించడం కనిపించింది. బోరింగుల వద్దకు 9వ తేదీ రాత్రి బకెట్లు, బిందెలు పట్టుకుని ఆడ, మగ అంతా పరుగులు తీసి అవసరమైన నీటిని తెచ్చుకోవడం వారి వంతైంది. అత్యధికంగా ఎండాడ ప్రాంతంలో

మిగతా 2లో..

## 10న లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవం

### ఏర్పాట్లపై కలెక్టర్ మల్లికార్జున సమీక్ష

**ప్రజాశక్తి-కలెక్టరేట్:** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవం మే 10వ తేదీన నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కె.చంద్రమోహన్, ఈవో శ్రీనివాస మూర్తి, జీవీఎంసీ కమిషనర్ సీఎం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఏడీసీ కెఎస్. విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్ కుమార్ ఇతర అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం చందనోత్సవం ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించే స్లాట్ల ప్రకారం దర్శనాలకు అనుమతించాలని, ఇతర కార్యకలాపాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. 10వ తేదీ ఉదయం 3.30 నుంచి 4.30 గంటల వరకు (గంటపాటు) మాత్రమే అనువంశిక ధర్మకర్త, టిటిడి నుంచి పట్టువస్త్రాలు సమర్పించే వారికి, సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు, దాతలకు అంతరాలయ దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి చందనోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి దర్శనాలు ఉంటాయని, పొలిటికల్ ప్రొటోకాల్ ఉండబోదని స్పష్టం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. టిక్కెట్ల విక్రయ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని నగర పరిధిలోని ఏడు నుంచి 10 బ్యాంకుల్లో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మే నెల 6వ తేదీ లోపు టిక్కెట్ల విక్రయాల ప్రక్రియను పూర్తి చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. రూ.1500, రూ.1000, రూ.300 ధరల మేరకు టికెట్ల జారీ ప్రక్రియను ప్రణాళికాయుతంగా చేపట్టాలన్నారు. టికెట్టుపై హోలో గ్రామ్, వాటర్ మార్కు వచ్చేలా రూపొందించాలని సూచించారు. రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి మాత్రమే నీలాద్రి గుమ్మం వద్ద నుంచి దర్శనానికి అనుమతిస్తారని స్పష్టం చేశారు. కొండపైకి వాహనాల రాకపోకలను గణనీయంగా తగ్గించాలని పోలీసు విభాగ అధికారులకు చెప్పారు.



చందనోత్సవంపై సమీక్షిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

---

**మోడీ మళ్లీ అధికారంలోకి వస్తే ఇక ఎన్నికలుండవు**

వార్త మెయిన్‌లో..

**ఆర్‌టిసి బస్సులో తరలిస్తున్న గంజాయి పట్టివేత**

వార్త మెయిన్‌లో..

**12 నుంచి నాటకోత్సవాలు**

వార్త 8లో..

**రూ.6 లక్షలు స్వాధీనం**

వార్త 2లో..

---

## ఎన్నికల ప్రక్రియపై అవగాహనుండాలి

### జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సూచించారు. తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిన పీవోలకు, ఏపీవోలకు తొలి విడత శిక్షణ సదస్సులు బుధవారం ప్రారంభమయ్యాయి. దానిలో భాగంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన శిక్షణా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ క్రమంలో తూర్పు నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వహించనున్న అధికారులకు పలు సూచనలు చేశారు. శిక్షణ ప్రక్రియపై వారితో కాసేపు మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. సందేహాలుంటే శిక్షణ శిబిరాల్లోనే నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు.





శిక్షణ ప్రారంభంలో మాట్లాడుతున్న జెపి మయూర్ అశోక్

## సంబల్‌పూర్ డివిజన్‌లో పలు రైళ్ల సేవలు నియంత్రణ

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** సంబల్‌పూర్ డివిజన్‌లోని టిట్లాగర్-సింగపూర్ రోడ్ సెక్షన్ మీదుగా లాంజిగర్ రోడ్- అంబోదలా- డోయికల్లు స్టేషన్‌ల మధ్య 3వ లైన్‌ను ప్రారంభించడం కోసం ప్రీ-నాన్-ఇంటర్‌లాకింగ్, నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా పలు రైళ్ల సేవలను నియంత్రిస్తున్నట్లు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

**పలు రైళ్లు రద్దు**

08527 విశాఖపట్నం- రాయ్‌పూర్ ప్యాసింజర్, 08528 రాయ్‌పూర్-విశాఖపట్నం ప్యాసింజర్, 08504 విశాఖపట్నం-భవానీపట్న ప్యాసింజర్, 18301 సంబల్పూర్- రాయగడ ఎక్స్‌ప్రెస్, 18302 రాయగడ-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు రద్దు చేయగా 08503 భవానీపట్న-విశాఖపట్నం ప్యాసింజర్‌ను ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

**రీషెడ్యూల్**

12808 నిజాముద్దీన్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 15, 18 తేదీల్లో ఒక గంట ఆలస్యంగా 8 గంటలకు రీషెడ్యూల్ చేశారు. 18573 విశాఖపట్నం-భగత్ కి కోఠి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18న 2గంటల 30 నిమిషాల ఆలస్యంగా రాత్రి 7.50 గంటలకు రీషెడ్యూల్ చేశారు. 12808 నిజాముద్దీన్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22న 2గంటల ఆలస్యంగా 9.00గంటలకు రీషెడ్యూల్ చేశారు.

**గమ్యస్థానల మార్పు**

ఈ నెల 14 నుంచి 23వ తేదీ వరకు హౌరా నుంచి బయలుదేరే రైలు 18005 హౌరా-జగ్దల్‌పూర్ సామలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాగర్‌లో షార్ట్‌టర్మినేట్ చేస్తారు. 18006 జగదల్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు వరకు జగదల్‌పూర్‌కు బదులుగా టిట్లాగర్ నుంచి బయలుదేరుతుంది.

**రైళ్ల మళ్లింపు:**

ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు టాటా నగర్ నుంచి బయలుదేరే 18189 టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ టాటా-జరోలి-జఖాపురా-కటక్-ఖుర్దా రోడ్-విజయనగరం మీదుగా మళ్లిస్తారు. ఈ నెల 14 నుంచి 23వ తేదీ వరకు ఎర్నాకులం నుంచి బయలేదేరే 18190 ఎర్నాకులం - టాటానగర్ రైలు విజయనగరం- ఖుర్దా రోడ్- కటక్-జఖాపురా- జరోలి- టాటా నగర్ మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుంది. ఈ నెల 21న విశాఖపట్నం నుంచి బయలుదేరే 18311 విశాఖపట్నం-బెనారస్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 22న బెనారస్ నుంచి బయలుదేరే 18312 బెనారస్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లు విజయనగరం- ఖుర్దా రోడ్- అంగుల్-సంబల్‌పూర్ సిటీ-జార్సుగూడ మీదుగా మళ్లించిన మార్గంలో ప్రయాణిస్తాయి. ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని సూచించారు.

మొదటి పేజీ తరువాయి..

## నగరంలో తాగునీటి కష్టాలు

అపార్టుమెంట్లు, భారీ భవంతుల నిర్మాణాలతో భూగర్భ జలాలకు ముప్పు ఏర్పడిందన్నది 2022లోనే భూగర్భ జలశాఖ నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఇక్కడ నీటి కొరత తీవ్రమయ్యే అవకాశాలున్నాయి.

**ఎంత నీరు అవసరం? ఎంతొస్తుంది!**

నగర జనాభా సుమారు 25లక్షలకు చేరుకుంది. జనాభా అవసరాలకు తగ్గ నీటిసరఫరా జరగాలంటే కనీసం రోజుకు 500 ఎంజిడి (మిలియన్ గేలన్లు) నీరు అవసరం కాగా 400 ఎంజిడిల నీరు వస్తుందని జివిఎంసి సూపరింటెండెంట్ ఇంజినీరు కెవిఎన్ రవి ప్రజాశక్తికి బుధవారం తెలిపారు. దీంట్లో 75 ఎంఎల్‌డి పరిశ్రమలకు ఇవ్వగా డొమెస్టిక్ అవసరాలకు సుమారు 300 పైచిలుకు ఇస్తున్నామన్నారు. రోజు రోజుకూ సరఫరా చేయాల్సిన ప్రాంతాలు నగరంలో పెరుగుతున్న మాట నిజమేనన్నారు. నగరంలో పూర్తిగా కుళాయిలు రాకపోవడం (నో సప్లయ్) అనే సమస్య లేదని ఎస్ఇ చెప్పారు. రోజుకు 125 ట్రిప్‌లు వాహనాల్లో అవసరమైన చోట్ల నీటిని అందించడానికి జివిఎంసి సిద్ధంగా ఉందన్నారు. ఏలేరు నుంచి పంపింగ్ ద్వారా నగరానికి 42 ఎంజిడి, రైవాడ నుంచి 15 ఎంజిడి నీటిని తీసుకొస్తున్నామని తెలిపారు. తాటిపూడి, మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్లలో నీటికి కొరత లేదని, గోస్తనీ నుంచి 4 ఎంజిడి, ముడసర్లోవ నుంచి 0.5, గోస్తనీ నుంచి 0.5 ఎంజిడిల నీరు తెస్తున్నట్లు తెలిపారు.


ప్రచారంలో పాల్గొన్న వంశీకృష్ణ

## పదేళ్లుగా 'దక్షిణం' అభివృద్ధి లేదు

### వంశీకృష్ణ శ్రీనివాస్

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :** దక్షిణ నియోజకవర్గం నుంచి 10 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న వాసుపల్లి గణేష్ కుమార్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయటంలో పూర్తిగా విఫలం చెందారని టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ ఆరోపించారు. జివిఎంసి 39వ వార్డు పద్మానగర్, చిలకపేట, వాడవీధి ప్రాంతాలలో ఆయన ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు ఆయన వెంట పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా తనకు ఒక అవకాశం కల్పించాలని కోరారు. సమస్య ఎలాంటిదైనా పరిష్కారం చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ సంఘాల పెద్దలు, గ్రామ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

**37వ వార్డులో...**

37వ వార్డు రంగిరీజువీధి, గొల్లవీధి, పప్పులవీధి ప్రాంతాలలో వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు. ఆయా వీధులలో ప్రజలతో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ ప్రచారంలో జనసేన వార్డు అధ్యక్షులు గరికిన రవి, టిడిపి వార్డు అధ్యక్షులు కోనాడ చిన్న, బంగారు రవి, బిజెపి నాయకుడు తాతాజీ పాల్గొన్నారు.

## 'దక్షిణం' కాంగ్రెస్ అభ్యర్థిగా వాసుపల్లి సంతోష్

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** దక్షిణ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా మత్స్యకార సామాజిక తరగతికి చెందిన వాసుపల్లి సంతోష్ పేరును ఆ పార్టీ కార్యదర్శి కెసి వేణుగోపాల్ ప్రకటించారు. ఆటో డ్రైవర్ కుమారునిగా ఉండే తనకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వడం ఆనందంగా ఉందని, ఇందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిలకు సంతోష్ కృతజ్ఞతలు తెలిపారు.

## నవ జవాన్ భారత్ సభ సభ్యులపై ఆర్ఎస్ఎస్ దాడి

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** ఈవీఎంల వల్ల అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్లకార్డులతో వీధి వీధి తిరుగుతూ ప్రచారం చేస్తున్న తమపై ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు దాడి చేశారని నవ జవాన్ భారత్ సభ సభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ దాడి ఘటనపై నవజవాన్ భారత్ సభ ప్రతినిధి జయభరత్ మాట్లాడుతూ, పెదవాల్తేరు సమీపంలోని జాలారిపేటలో భగత్ సింగ్ జన అధికార యాత్రను బుధవారం నిర్వహిస్తుండగా జాలారిపేటకు చెందిన జోగారావు అతని అనుచరులు అడ్డుకొని దాడికి దిగారని తెలిపారు. తాము ఏ రాజకీయ పార్టీకి చెందిన వారముకాదని, ప్రజలకు అవగాహన కలిగిస్తూ చైతన్య పరుస్తున్నామని సభ్యులు వివరించినప్పటికీ వినకుండా అరుణ్ కుమార్, సృజన్, రజిత, పూజ తదితరులపై దాడి చేసి అసభ్య పదజాలంతో దూషించారని వివరించారు.

# దువ్వాడ మీదుగా వేసవి ప్రత్యేక రైళ్లు

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** వేసవిలో ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి సికింద్రాబాద్ - సంత్రాగచ్చి, సికింద్రాబాద్ - షాలిమార్ ప్రత్యేక రైళ్లు నడపాలని రైల్వే నిర్ణయించింది. ఈ క్రమంలో 07223 సికింద్రాబాద్ - సంత్రాగచ్చి సమ్మర్ స్పెషల్ రైలు ఈ నెల 19, 26, మే 3, 10, 17, 24, 31, జూన్ 7, 14, 21 తేదీల్లో ప్రతి శుక్రవారం ఉదయం 7.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి సాయంత్రం 19:55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 07224 సంత్రాగచ్చి - విశాఖపట్నం వేసవి ప్రత్యేక రైలు ఈ నెల 20, 27, మే 4, 11, 18, 25, జూన్ 1, 8, 15, 29 తేదీలలో ప్రతి శనివారమూ మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రాగచ్చి నుంచి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 2:03 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అదేరోజు మధ్యాహ్నం 14.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం, పలాస, బెర్హంపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ మధ్య ఎస్.ఖాందరనగర్ రోడ్ మీదుగా ప్రయాణిస్తాయి.

07225 సికింద్రాబాద్ - షాలిమార్ సమ్మర్ స్పెషల్ రైలు ఈ నెల 15, 22, 29, మే 6, 13, 20, 27, జూన్ 3, 10, 17 తేదీలలో ప్రతి సోమవారం ఉదయం 4.30 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మధ్యాహ్నం 14:30 గంటలకు దువ్వాడ చేరుకుటుంది. మరుసటి రోజు ఉదయం 6.05 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. 07226 షాలిమార్ - సికింద్రాబాద్ సమ్మర్ స్పెషల్ రైలు ఈ నెల 16, 23, 30, మే 7, 14, 21, 28, జూన్ 4, 11, 18 తేదీల్లో ప్రతి మంగళవారమూ ఉదయం 10.00 గంటలకు షాలిమార్ నుంచి బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి 1:25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అదేరోజు మధ్యాహ్నం 13.00 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బెర్హంపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్, బాలాగ్‌పూర్, భద్రాగ్, కటక్ మధ్య, బాలాగ్‌పూర్, భద్రాగ్,మీదుగా ప్రయాణిస్తాయి.

**పలు రైళ్లు రద్దు**

దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో ఈ నెల 11 నుంచి 28 వరకు రోలింగ్ స్టాక్ కారిడార్ కార్యక్రమం కారణంగా 07466 రాజమండ్రి - విశాఖపట్నం ప్యాసింజర్, 07467 విశాఖపట్నం-రాజమండ్రి ప్యాసింజర్ రైళ్లను ఏప్రిల్ 11 నుండి 28 వరకు రద్దు చేశారు.

**రైళ్ల రీషెడ్యూలింగ్**

ఖుర్దా డివిజన్‌లోని గంగాధర్‌పూర్-బాలుగావ్‌లో భద్రత సంబంధిత ఆధునికీకరణ పనుల కారణంగా ఈ నెల 11న పూరి నుంచి బయలుదేరే 18417 పూరి-గుణపూర్ ఎక్స్‌ప్రెస్ 13.00 గంటలకు రీషెడ్యూల్ చేశారు. ఈ నెల 11న భువనేశ్వర్ నుంచి బయలుదేరే 12830 భువనేశ్వర్- ఎంజి ఆర్ చెన్నైసెంట్రల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ 13.10 గంటలకు రీషెడ్యూల్ చేశారు.

## 33వ వార్డులో వైసిపి ప్రచారం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** జివిఎంసి 33వ వార్డు పరిధి అల్లిపురం వెంకటేశ్వరమెట్ట ప్రాంతంలో వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ కలిసి రోడ్డు షో నిర్వహించారు. ప్రజలకు అభివాదం తెలుపుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మాట్లాడుతూ, రాష్ట్రంలో ధర్మం గెలవడానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని బలపరచాలని విజ్ఞప్తిచేశారు. సంక్షేమం, అభివృద్ధి కావాలంటే ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్ కుమార్‌కు, విశాఖ ఎంపీగా తనకు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ, 33 వార్డులో ఎన్నో సమస్యలను పరిష్కరించానని గుర్తుచేశారు. వెంకటేశ్వర మెట్ట, లీలామహల్ జంక్షన్, సాయిబాబా వీధి, నారాయణ వీధి, విద్యోదయ స్కూల్, సౌత్ జైల్ రోడ్, కల్వరి బాప్టిస్ట్ చర్చి, కొప్పెన రామారావు జంక్షన్, డాల్ఫిన్ హోటల్, లీలామహల్ పెట్రోల్ బంక్ వరకు రోడ్ షో సాగింది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, పార్టీ దక్షిణ నియోజకవర్గం పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, వైసిపి నాయకులు ముత్తాబత్తుల రమేష్, పచ్చిరపల్లి రాము, బొడ్డేటి ప్రసాదరావు, నీలకంఠం, శ్రీను, శ్రీహరి రెడ్డి, వై.సురేష్, గరికిన గౌరీ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు షోలో పాల్గొన్న బొత్స ఝాన్సీ, వాసుపల్లి తదితరులు

## రూ.6 లక్షలు స్వాధీనం

**ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ :** సాధారణ ఎన్నికల విధుల్లో భాగంగా విశాఖ ఎంవిపికాలనీ సర్కిల్ సమీపంలో తనిఖీచేస్తున్న ఎంసిసి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) బృందం వైసిపి రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి ప్రయివేటు కార్యదర్శి జి.దశరధరామిరెడ్డి హోండా క్రెటా వాహనం ఎపి 40ఎ 5557 డాష్ బోర్డులో దాచి ఉంచిన రూ.6 లక్షల నగదును పట్టుకున్నారు. ఒక ఇంటి కొనుగోలు నిమిత్తం తీసుకెళ్తున్నానని దశరథ రామిరెడ్డి అధికారులకు వివరించారు. అందుకు తగిన ఆధారాలేమీ చూపకపోవడంతో ఎంసిసి బృందం కేసు నమోదు కోసం ఎంవిపి పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

## వడదెబ్బ మృతుల కుటుంబాలకు పరిహారమివ్వాలి

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వడగాల్పులు వల్ల వివిధ జిల్లాల్లో మృతిచెందిన సుమారు 22 మంది కుటుంబాలకు పరిహారమివ్వాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు డిమాండ్‌చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 235 మండలాలలో వడగాల్పులు వీచాయని తెలిపారు. ఏడు జిల్లాలలో గరిష్ట ఉష్ణోగ్రత 45 డిగ్రీలు దాటిందని పేర్కొన్నారు. ఇంకా వడగాలులు వీచే అవకాశముందని రాష్ట్ర ప్రభుత్వాన్ని విపత్తుల నిర్వహణ సంస్థ ముందుగానే హెచ్చరించిందని తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటుచేయాలని, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ప్రాంగణంలోనే చలివేంద్రాలతో పాటు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయాలని కోరారు.

## విశాఖ మార్కెట్‌లోకి హెక్టర్ బ్లాక్ స్టోమ్




**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** బ్రిటిష్ ఆటో మొబైల్ బ్రాండ్ ఎంజి (మోరిస్ గ్యారేజెస్), ఎంజి హెక్టర్ బ్లాక్ స్టోమ్ కారును బుధవారం విశాఖలో ప్రారంభించారు. బీచ్ రోడ్‌లోని ఎంజి మోటర్స్ షో రూమ్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ఎంజి మోటార్ ఇండియా చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సతిందర్ సింగ్ బజ్వా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంజి హెక్టర్ బ్లాక్ స్టోమ్ కారు టెక్ కనెక్ట్ చేయబడిన ఫీచర్ల శ్రేణితో అందిస్తున్నట్లు వివరించారు. దీని ప్రారంభ ధర రూ.21.24 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా ఉందని వివరించారు.

## తూర్పులో వెలగపూడి ముమ్మర ప్రచారం

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** తూర్పు నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం ఉదయం 6 గంటల నుంచి పెద్దగదిలి కొండ పరిసర ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు అధికారంలోకి వస్తే సూపర్ 6 పథకాలన్నీ ప్రతి ఇంటికి అందజేస్తామని, బీసీలకు రక్షణ కల్పిస్తామని చెప్పారు. సింహాచలం భూముల్లో నివసిస్తున్న వారందరికీ పట్టాలిప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన, బిజెపి, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## 'ఉత్తర'ను ఉత్తమంగా తీర్చిదిద్దుతా

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి, ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, సిబిఐ మాజీ జెడి వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఎన్‌జిఒ కాలనీ, మురళీనగర్‌లో ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కొండవాలు ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాను గెలిచిన తర్వాత వారి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. టార్చిలైట్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ సతీమణి ఊర్మిల, పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌టిఎల్‌లో జ్యోతీరావు పూలే జయంతి



పూలేకు నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, వర్గీస్

ప్రజాశక్తి -కరాస: మహాత్మా జ్యోతీరావు పూలే 197వ జయంతిని ఎన్ఎస్‌టిఎల్ ఒబిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు నావల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎన్ఎస్‌టిఎల్ సంచాలకులు డాక్టర్ అబ్రహం వర్గీస్ పాల్గొని, జ్యోతీరావు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూలేకు పుష్పాంజలి ఘటించారు. వివిధ సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌టిఎల్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఉర్బన్ కుమార్, అమర్జీత్‌టీ, సివిల్ ఎంప్లాయిస్ యూనియన్, వర్క్స్ కమిటీ నాయకులు సిహెచ్ చంద్రశేఖరరావు, జెఎన్ వర్మ, జి. నాగభూషణం, రోజాలిన్ మల్లిక్ పాల్గొన్నారు.

## మనోధైర్యాన్ని కోల్పోవద్దు

ప్రజాశక్తి- సీతమ్మధార : పబ్లిక్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, లేకుంటే ఫెయిలయ్యామనే బాధతో విద్యార్థులు మనోధైర్యాన్ని కోల్పోయిన ఆత్మన్యూనతా భావంతో అనాలోచిత నిర్ణయాలకు పాల్పడవద్దనిరాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఈ నెల 12న ఇంటర్ పరీక్షా ఫలితాలు వెలవడనున్న నేపథ్యంలో విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులకు మార్కులు, ఉత్తీర్ణత అంశాలే ముఖ్యం కాదని, విద్యార్థి దశలో ఇదొక చిన్నమెట్టు మాత్రమేనన్నారు. ప్రతి ఓటమిని గెలుపునకు తొలిమెట్టుగా భావించి, రెట్టించిన పట్టుదలతో కృషిచేసి అనుకున్నది సాధించాలని పిలుపునిచ్చారు. పరీక్ష ఫెయిల్యయ్యాననే బాధతో అఘాయిత్యాలకు పాల్పడి, తల్లిదండ్రులు, కుటుంబీకులు, స్నేహితులకు మానసిన వేదనకు గురిచేయవద్దని హితవు పలికారు.

## కీటక జనిత వ్యాధులపై అప్రమత్తత

ప్రజాశక్తి- సీతమ్మధార : కీటక జనిత వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి, అప్రమత్తతతో ఉండాలని డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక ప్రాంతీయ నేత్ర వైద్యాలయ సమావేశ మందిరంలో ఆరు జిల్లాల డిఎంఒలు, ఎఎంఒలు, సీనియర్ ఎంటమాలజిస్ట్, మలేరియా సబ్‌యూనిట్ అధికారులు, ఎంపిహెచ్ఇఒలకు శిక్షణనిచ్చారు. దోమలు, ఇతరత్రా కీటకాలతో వచ్చే డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధి లక్షణాలు వచ్చిన వెంటనే రోగుల రక్త నమూనాలను సేకరించి, వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, పాజిటివ్‌గా తేలితే ప్రభుత్వపరంగా ఉచిత మందులను అందజేయాలని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## వెంపాడకు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి -తగరపువలస : వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ వెంపాడ శ్రీనివాసరెడ్డిని యాక్టివ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం తగరపువలస ఉగాది పురస్కారాన్ని విశ్రాంత ఎస్‌పి రాజ శిఖామణి అందజేశారు. ఘనంగా సత్కరించారు.

# అవినీతి సొమ్ముతో గాజువాక ఓటర్లకు ఎర

- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి అమర్‌పై టిడిపి సమన్వయకర్త ప్రసాద్ ఫైర్



మాట్లాడుతున్న టిడిపి సమన్వయకర్త ప్రసాద్

ప్రజాశక్తి -గాజువాక :ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడబెట్టిన అవినీతి సొమ్ముతో గాజువాక ఓటర్లను కొనుగోలు చేసి మరోమారు అధికారం దక్కించుకోవాలని గాజువాక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎర వేస్తున్నారని తెలుగుదేశం పార్టీ గాజువాక సమన్వయకర్త ప్రసాదల శ్రీనివాస్ మండిపడ్డారు. బుధవారం గాజువాక పార్టీ కార్యాలయంలోకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, గాజువాక జోన్ పరిధిలోని భవన నిర్మాణదారుల నుంచి స్థానిక కార్పొరేటర్లు బెదిరించి, రూ.కోట్లలో దోచుకున్నారన్నారు. వైసిపి నేతల అవినీతి, అక్రమాలను వార్డుల వారీగా కరపత్రాలను రూపొందించి ప్రజలకు అందజేస్తామన్నారు. అరాచక పాలన సాగిస్తున్న వైసిపి, అవినీతి రారాజులైన ఆ పార్టీ నేతలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు సమర్థపాలన రాష్ట్రానికి అవసరమని, ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లాకార్యదర్శి సింగూర్ అనంత్, నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షులు తమ్మిరి శివప్రసాద్, 64వ వార్డు అధ్యక్షులు హరికృష్ణ, వివిధ వార్డులు పరిశీలకులు.కూన వెంకటరావు, డి.వి.సత్యారావు, పరిటాల శ్రీనివాస్, నందం తిరుమల రమేష్, కొరికిన చంద్రరావు, కదిరి పోలిరాజు. మైలపిల్లి నర్సింగ్‌పాల్గొన్నారు

## ఇండియా ఫోరమ్‌కు ఇపిఎస్ పెన్షనర్ల మద్దతు

ప్రజాశక్తి -ములగాడ : ఇపిఎఫ్ పెన్షనర్లకు పెన్షన్ సొమ్ము పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి హామీనిచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా మోసగించాయని, ఆయా పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బుద్ది చెప్పాలని అప్రా సంఘ సమావేశంలో నిర్ణయించారు. బుధవారం మల్కాపురం సిఐటియు కార్యాలయంలో కె.నూకరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో .అప్రా జిల్లా ప్రధాన కార్యదర్శిఎస్ కె హుస్సేన్ మాట్లాడుతూ, గత నెల 19న జరిగిన ధర్నా జయప్రదం చేసిన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. హయ్యర్ పెన్షన్ గురించి ఆందోళన పడాల్సిన అవసరం లేదని, రానున్న ఎన్నికల్లో హామీలిచ్చి మోసగించిన ప్రభుత్వాలు ఓడిపోవడం ఖాయమని, ఇండియా ఫోరం అధికారంలోకి రావడం, తమ డిమాండ్లన్నీ పోరాడి సాధించు కుందామన్నారు. స్టీల్‌ప్లాంట్ నుంచి రూ.400 కోట్లను ఇపిఎఫ్ హెడ్డాఫీసుకు జమచేసినా, పెన్షనర్లకు చెల్లింపులో సాంకేతిక కారణాలను చూపుతూ అలసత్వం చేస్తున్నారన్నారు. ఇపిఎఫ్ పెన్షనర్లకు కనీస పింఛనును రూ.నాలుగు వేలు నుంచి రూ.7500 వరకు ఫిబ్రవరి 29నాటికి ఖాతాల్లో జమ అవుతుందని బూటకపు హామీలు ఇచ్చి పెన్షనర్లను గందరగోళానికి గురి చేస్తున్నారని, వారి మాటలను నమ్మొద్దని సూచించారు. కేవలం డబ్బు వసూలు కోసమే ఇలాంటి దొంగ నాటకాలను కొందరు ఆడుతున్నారన్నారు. సీనియర్ సిటిజన్ల రైల్వే ఛార్జీ రాయితీని రద్దు చేసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఎలా నమ్మేదని ప్రశ్నించారు. గడచిన పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పైసా పెన్షన్ పెంచలేదని, మోడీ అధికారంలో ఉన్నంత వరకు పెన్షన్ పెరిగే అవకాశాలు లేవన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా ఫోరమ్‌కు మద్దతు ఇచ్చి, గెలిపించే బాధ్యత పెన్షనర్లపై ఉందన్నారు.

# జోరుగా వైసిపి ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి- ఆనందపురం: భీమిలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని గంభీరం, ఆనందపురం పంచాయతీల్లో బుధవారం వైసిపి నేతలు ఇంటింటా కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, జెడ్‌పిటిసి కోరాడ.వెంకటరావు, ఎంపిటిసిలు బొట్టా ధనలక్ష్మి రామకృష్ణ, నాయకులు బోయి.రమణ, ఉప్పాడ సూరిబాబు, ఇల్లిపిల్లి నర్సింగరావు, గుడ్ల.రమణ, ఇల్లిపిల్లి ముసలయ్య, తెడ్డపు సత్యవేణి, గోవింద్, మామిడి కిరణ్, ఉప్పాడ రామిరెడ్డి, ఉప్పాడ అప్పలరెడ్డి, దుక్క.నరసింహారావు బంక మహేష్, దల్లి రామారావు పాల్గొన్నారు. ఆనందపురంలో ప్రచారంలో స్థానిక సర్పంచ్ చందక లక్ష్మిసూరిబాబు, పాండ్రంకి అప్పారావు, శినగం రామారావు, రాంజీ, బోని అప్పలనాయుడు, చందక అప్పలనాయుడు, మీసాలనాయుడు పాల్గొన్నారు

**గోపాలపట్నం** : జివిఎంసి 91వ వార్డు గోపాలపట్నంలో కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో వైసిపి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సతీమణి ఆడారి మాలతి, పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పేడాడ రమణి కుమారి , 92వ వార్డు కార్పొరేటర్ బెహరా వెంకట స్వర్ణలత శివదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఫ్యాన్ గుర్తుపై ఓటేసి పశ్చిమ ఎమ్మెల్యేగా ఆనందకుమార్, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని అభ్యర్థించారు.కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆడారి విజయానికి సోదరి ప్రచారం**

ములగాడ : విశాఖ పశ్చిమ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనందకుమార్ విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం 58వ వార్డు కారాడ వీధి, శ్రీహరిపురం, పాత రామాలయం ప్రాంతాల్లో ఆయన సోదరి ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రామకుమారి ప్రచారం నిర్వహించారు. స్థానిక వార్డు అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, మండల క్లస్టర్ అధ్యక్షులు అంగ రాంప్రసాద్, పిల్లా కన్నబాబు, బర్రి సంతోష్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, వైసిపి నేతలు గొందేసి పెద్ద సత్యనారాయణ రెడ్డి, ధర్మాల వేణుగోపాల్ రెడ్డి, ప్రచార కమిటీ అధ్యక్షులు గొందేసి చిన సత్యనారాయణరెడ్డి, మాతా రాజు, అయినవిల్లి రాంబాబు, చాత్ర పాల్, అయినవిల్లి కుమారి, తాడి సత్యానందం, వంగా శ్రీను, అల్లం సునీత, కాశి, జగదాంబ, దుర్గమ్మ, లోవ రాజేశ్వరి పాల్గొన్నారు.

## 17న గాజువాక మ్యానిఫెస్టో విడుదల

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గ మేనిఫెస్టోను ఈనెల 17న విడుదల చేయనున్నామని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. నియోజకవర్గ ప్రజల అభిమతానికి అనుగుణంగా మేనిఫెస్టోను రూపొందిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గాజువాక నియోజకవర్గ మహిళా నాయకులు, కార్యకర్తలతో బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో డిసిఎంఎస్ మాజీ చైర్పర్సన్ పల్లా చిన్నతల్లి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ సమీకరణాల నేపథ్యంలో పదవులు వచ్చినా, రాకపోయినా, కష్టించి పనిచేసే వారికి గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలతో మహిళలందరూ సంతృప్తిగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయం ఖాయమన్నారుకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పలు గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, ఉరుకూటి అప్పారావు, రొంగలి జగన్నాథం, భూపతిరాజు సుజాత, ఇళ్లపు వరలక్ష్మి, ఈగలపాటి యువశ్రీ, ప్రమీల, నిర్మలరెడ్డి, గంగభవాని, కల్పన, శిరీష, రోజా రాణి, మీరా, స్వాతి రెడ్డి, రామలక్ష్మి విమలధామస్, ఒమ్మి ఈశ్వరి విజయలక్ష్మి పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం
### - మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్‌రోడ్డు తొట్లకొండ వద్ద మంగళవారం అర్ధరాత్రి దాటాక జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు.మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం..రుషికొండ నుంచి భీమిలి వైపు వస్తుండగా మార్గమధ్యలో తొట్లకొండ వద్ద స్నేహితుని మోటారు బైక్ ఆగిపోయిందని తెలుసుకున్న రుషికొండకు చెందిన దొలపల్లి చిన అప్పలరాజు తన స్కూటీపై తొట్లకొండ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో మోటారు బైక్, స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన చిన అప్పలరాజు (25)ను కెజిహెచ్‌కు తరలించగా,మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో స్కూటీని ఢీకొట్టిన బైకిస్ట్ చింతపల్లి వీరభద్ర (27) తీవ్రగాయాలపాలై, ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృత్యువాత పడ్డాడు. ఇదే ప్రమాదంలో బైక్ పై వెనుక కూర్చున్న దుర్గ, రాజు తీవ్ర గాయాలతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రి గేట్ ఎదురుగా ఉన్న ఒటి ట్రైమ్ దుకాణం వెనుక సుమారు 55 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గడుల టీ షర్ట్, ట్రాక్ ధరించి ఉన్న వ్యక్తి మరణించాడు. మతి స్థిమితం లేని వ్యక్తి కావచ్చని భావిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు భీమిలి పోలీసులను సంప్రదించాలని సూచించారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో అత్తింట్లో అల్లుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. సిఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివి. జివిఎంసి ఆరో వార్డు గాయత్రినగర్‌కు చెందిన మామిడి ఈశ్వరరావు తన కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్న ఈశ్వరరావు, ఈనెల 8న రాత్రి సాంకేతిక కళాశాల సమీపంలోని తన అత్తవారింట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెల్లవారి బంధువులు చూసేసరికి ఫ్యాన్‌కి వేలాడుతూ కనిపించాడు. మృతుని భార్య గౌరీ ఫిర్యాదు మేరకు, ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్యాపిల్లలు ఉన్నారు.

## మనస్తాపంతో ఆత్మహత్య

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని ఆనందపురం హైస్కూల్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున పల్లా పైడిరాజు (55) అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హైస్కూల్ సమీపంలోని యాదవుల కాలనీలో నివాసముంటూ, ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్న పైడిరాజు మద్యానికి బానిసై, అనారోగ్యం పాలయ్యాడు. దీంతో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబసభ్యులు అంటున్నారు. పైడిరాజుకు భార్య సింహాచలం, ఇద్దరు కుమారులు రామ లక్ష్మణ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు రామ లక్ష్మణ ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎస్ఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## విద్యార్థి అదృశ్యం



సాయిసుశాంత్

ప్రజాశక్తి -మధురవాడ : విద్యార్థి అదృశ్యంపై పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సిఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివి. జివిఎంసి ఎనిమిదో వార్డు మిధిలాపురి ఉడాకాలనీకి ఎదురుగా వికలాంగుల కాలనీలో బల్లంకి కొండమ్మ, ప్రసాద్ దంపతులకు నివాసిస్తున్నాడు. వీరి కుమారుడు సాయి సుశాంత్ పదో తరగతి పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. కాగా ఈనెల 9న దంపతులిద్దరూ రోజువారీ మాదిరిగానే విధులకు వెళ్లి తిరిగొచ్చేసరికి సాయిసుశాంత్ కనిపించలేదు. కుటుంబసభ్యులు, స్నేహితుల ఇంట వెదికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వర్మరాజు


అడపా వెంకటవర్మ రాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాళ్లవలసకు చెందిన హాసిని గ్రూప్ సంస్థల ఛైర్మన్ అడ్డాల వెంకటవర్మ రాజును కాంగ్రెస్ పార్టీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆ పార్టీఅధిష్ఠానం ఎంపిక చేసింది. దీనిపై పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అతని అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఎంబిఎ, ఎల్ఎల్‌బి పూర్తి చేసిన వర్మరాజు, కోవిడ్ సమయం లో ఎంతోమంది పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. విద్యార్థి దశ నుంచి రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్న ఇతను ఇటీవలనే కాంగ్రెస్ లో చేరారు. తనకు భీమిలి అసెంబ్లీ స్థానానికి టిక్కెట్ కేటాయించడం పట్ల పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి కెసి వేణుగోపాల్, ఏపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిలారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు

## ఇండియా ఫోరమ్‌కు ఒక్క ఛాన్సివ్వండి


మాట్లాడుతున్న పెందుర్తి ఫోరం అభ్యర్థి భగత్

ప్రజాశక్తి-వేపగుంట : రాష్ట్రంలో రెండు పార్టీల పాలనను ప్రజలు చూశారని, ఇండియా ఫోరమ్‌కు ఒక్క అవకాశమివ్వాలని ఆ పార్టీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి భగత్ అన్నారు. బుధవారం సాయంత్రం కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, ఇండియా ఫోరంలో నూతనోత్తేజం కనిపిస్తోందన్నారు. నియోజకవర్గంలో పంచగ్రామాలు, తాడితెలిపుంపు వంటి సమస్య పరిష్కారంలో వైసిపి, టిడిపి పూర్తిగా విఫలమయ్యాయన్నారు. దేశమంతా రాహుల్‌ప్రధాని కావాలని కోరుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేత ఆర్ఆర్.నాయుడు, పరవాడ మండల పార్టీ అధ్యక్షుడు జి శ్రీనివాసరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు

## కెరియర్ గైడెన్స్‌పై అవగాహన


మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి మురళి ఐది

ప్రజాశక్తి - గాజువాక : స్థానిక ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. కళాశాల పూర్వ విద్యార్థి మురళి మాట్లాడుతూ, చదువు పూర్తయిన వెంటనే జీవితంలో స్థిరపడాలంటే, విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సైన్స్ రంగాలకు మంచి క్రేజ్ ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ వి.కృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ: మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి మధురవాడ ఫీడర్ నిర్వహణ పనులు, మరమ్మతులు దృష్ట్యా ఈనెల 12న శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ డిఇఇ పి. శ్రీనివాసరావు తెలిపారు.మధురవాడ మెయిన్ రోడ్, భగవాన్ దాస్ కాలనీ, ఎంఎస్ఆర్ లే అవుట్, సాయిప్రియా లే అవుట్, చంద్రం పాలెం, భాస్కర్ నగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

# కొలువుదీరిన కొత్త న్యాయవాదుల సంఘం



బాధ్యతలు స్వీకరిస్తున్న కొత్త బార్ కౌన్సిల్ ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : విశాఖపట్నం న్యాయవాదుల సంఘం నూతన కమిటీ బుధవారం కొలువు దీరింది. పాత కమిటీ నుంచి బాధ్యతలను స్వీకరించింది. నూతన కమిటీ అధ్యక్షులు బెవరా సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఇమంది శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి దంతా నరేష్‌కుమార్ సంయుక్త కార్యదర్శి అడపా సుధాకర్, కోశాధికారి సొప్పా అశోక్‌బాబు, ఇతర పాలకమండలి సభ్యులు బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి, అందరి సహకారం, సమన్వయంతో కృషి చేస్తానన్నారు.కొత్త కమిటీకి పూర్వ కమిటీ అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైల శ్రీనివాసరావు సీనియర్ న్యాయవాదులు ఇమంది కూర్మారావు, ఎస్ మోహన్‌నాయుడు బగాది తులసీదాస్, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు ఎస్.కృష్ణమోహన్, సభ్యులు రామ జోగేశ్వరరావు, బైపా అరుణ్‌కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు

# ఫోరం అభ్యర్థి విమల విజయమే లక్ష్యం


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఫోరం అభ్యర్థి విమల

ప్రజాశక్తి -ములగాడ : విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఇండియా వేదిక తరపున పోటీచేస్తున్న సిపిఐ అభ్యర్థి అత్తిలి విమల గెలుపే లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలని ఫోరం నేతలు స్పష్టం చేశారు. బుధవారం ఉదయం 61వ వార్డు మల్కాపురం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, ఇతర వేదిక పార్టీల నేతలు, ప్రజాసంఘాలు ఆత్మీయసమావేశం నిర్వహించి, ఫోరం అభ్యర్థి విమల విజయానికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఫోరం పార్టీల నేతలు మాట్లాడుతూ, ఎన్‌డిఎ కూటమిలోని బిజెపి, టిడిపి, జనసేనతోపాటు వైసిపి అన్ని పార్టీలకు ప్రజా ప్రయోజనాల కన్నా వ్యక్తిగత స్వార్థాలే ముఖ్యమనానరు. విభజన హామీల అమలుకు కేంద్రంపై ఒత్తిడి తేవడంలో ఆయా పార్టీలు విఫలమవ్వడంతోపాటు స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుకు కట్టబెట్టాలన్న కేంద్రం నిర్ణయాన్ని అడ్డుకోలేకపోయాయన్నారు. మద్యనిషేధం, సిపిఎస్ రద్దు వంటి హామీలను అమలు చేయలేని సిఎం జగన్, వైసిపిలకు ఓట్లడిగే అర్హతే లేదన్నారు.ఈ నేపథ్యంలో ఎపికి ప్రత్యేకహోదా,స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, ప్రజాసంక్షేమం, అభయహస్తం అమలకు ఫోరం అభ్యర్థి అత్తిలి విజయను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె సత్యంజనేయ, జి రాంబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మరియాదాసు, 59వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు రమణ, 61వ వార్డు కాంగ్రెస్ నాయకుడు నూకరాజు, మహిళా కాంగ్రెస్ నేత రజియా బేగం, సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పైడిరాజు, పెంటారావు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు వనజాక్షి, కార్యదర్శి ఎండీ బేగం, పుష్ప, దేవుడమ్మ, నేతలు అచ్యుతరావు, అష్రాఫ్ షరీఫ్, నూరుద్దీన్ పాల్గొన్నారు.

# చేరికలతో టిడిపికి మరింత శక్తి


వెంకటప్పడుకు కండువా వేసి టిడిపిలోకి ఆహ్వానిస్తున్న గంటా

ప్రజాశక్తి -తగరపువలస: వైసిపి నుంచి చేరికలతో టిడిపి శక్తి మరింత పెరిగి, ఉత్సాహం రెట్టింపయ్యిందని కూటమి తరపున పోటీలో ఉన్న భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మాజీ జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు ఆధ్వర్యంలో మండలంలోని సింగనబంద, లక్ష్మీపురం, మజ్జివలస, మజ్జిపేట, నారాయణరాజు పేట, దాకమర్రి తదితర పంచాయితీలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గంటా శ్రీనివాసరావు సమక్షంలో టిడిపిలో చేరారు. గాడు వెంకటప్పడు, గాడు తాతినాయుడు, మజ్జి వెంకటరావు, నీలాపు సూర్యనారాయణ తదితరులకు పార్టీ కండువాలు వేసిన గంటా టిడిపిలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మజ్జివలసలో బహిరంగ సభలో గంటా మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారం ప్రారంభంలోనే ఇంత పెద్దస్థాయిలో టిడిపిలో చేరికలు ఆనందంగా ఉందన్నారు. టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు మాట్లాడుతూ, టిడిపి విజయానికి ప్రతిఒక్కరూ పని చేయాలని కోరారు. కొత్తగా టిడిపిలో చేరిన గాడు వెంకటప్పడు మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వ విధానాలు నచ్చకే టిడిపిలో చేరినట్లు వివరించారు. మంగళవారం రాత్రి వైసిపి నేతలు ఇంటింటికి వెళ్లి గంటా బహిరంగ సభకు వెళ్లొద్దని బెదిరించడాన్ని ఆపార్టీ వ్యవహారశైలి స్పష్టమౌతోందన్నారు.పార్టీ మండల అధ్యక్షులు డిఎవిఎస్ రాజు అధ్యక్షతన జరిగిన సభలో మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు, జనసేన నాయకులు ఇఎస్ఎస్ చంద్రరావు, బిజెపి నాయకులు కె రామానాయుడు తది తరులు మాట్లాడారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, మధురవాడ ప్రాంతాలకు చెందిన టిడిపి, జనసేన కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారుఅంతకుముందు గంటా శ్రీనివాసరావు మత్యకార గ్రామం అన్నవరంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించి, అనంతరం పెద నాగమయ్య పాలెం, చిప్పాడ గ్రామాల్లో నిర్వహించారు.

# మార్నింగ్ వాక్‌లో ఎన్నికల ప్రచారం


ఎన్నికల ప్రచారంలో ఓట్లను అభ్యర్థిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు టిపిటి కాలనీ వివేకానంద పార్క్, బందావన్ పార్క్‌ల్లో స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి వైసిపి ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు బుధవారం మార్నింగ్ వాక్ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్క్ వచ్చిన సందర్శకులతో ముచ్చటించి, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైసిపిని గెలిపించాలని కోరారు

**వైసిపి ఎన్నికల కార్యాలయం ప్రారంభం**

సీతమ్మధార : జివిఎంసి 46వార్డు కైలాసపురం శాంతినగర్‌లో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో వైసిపి వార్డు ఎన్నికల కార్యాలయాన్ని ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, స్థానిక ప్రజలతో మమేకమై, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**అన్నసమారాధన**

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం 25వ వార్డు సీతంపేటలో భక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో భద్రావతి సమేత భావనాఋషి స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, జివి.రవిరాజు, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వసంతల అప్పారావు, ఎం. సునీల్, అంబటి శైలేష్, గోవింద్, కె చిన్న, ఎస్.కృష్ణ, దూది నరసింగరావు, ఎస్. రామారావు, కె రామారావు, కె లావణ్య, లంక భాస్కరరావు, కిరణ్‌రాజు, రాయుడు శ్రీను, బి.గోవింద్, ఎం.సునీల్, సదరం జ్ఞానేష్, అశోక్ రెడ్డి, ఆదిరెడ్డి అప్పారావు, సాయి పాల్గొన్నారు.

# కుల సంఘాలతో వైసిపి ఆత్మీయ సమావేశం


కుల సంఘ సమావేశాల్లో వైసిపి అభ్యర్థులకు సత్కారం

ప్రజాశక్తి- సీతమ్మధార : కాపులకు ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి పెద్దపీట వేశారని వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. బుధవారం కాపుసేన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఫంక్షన్ హాల్‌లో కాపులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఝాన్సీలక్ష్మి కాపుల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సిఎం జగన్ కాపులకు సముచిత స్థానం కల్పించారన్నారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కె కె రాజు మాట్లాడుతూ విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో నలుగురు కాపు సోదరులకు సీఎం జగన్ అవకాశం కల్పించారన్నారు. నియోజకవర్గంలో ఐదేళ్లలో ఇన్‌ఆర్బిట్ మాల్, రహేజా వంటి సంస్థల పెట్టుబడులు వచ్చాయన్నారు. అవి పూర్తయితే 2 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా కాపు సంఘం ప్రతినిధులను బొత్స ఝాన్సీ, కెకె రాజు సన్మానించారు. కాపు సేన సంఘ గౌరవ అధ్యక్షులు బివిఎన్ మూర్తి, అధ్యక్షులు రాధాకృష్ణ, కన్వీనర్ టి.చంద్రమౌళేశ్వరరావు, జనరల్ సెక్రెటరీ బి.లంక భాస్కరరావు, జనపు రెడ్డి, సత్య రావు, బాణాల శ్రీనివాసరావు, ఉష శ్రీ, సేనాపతి అప్పారావు, రవీంద్రనాథ్ ఠాగూర్, మూర్తి , శేషు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

**కళింగవైశ్యులతో ఆత్మీయ సమావేశం**


సీతమ్మధార: అక్కయ్య పాలెం కళింగ వైశ్య భవనంలో కన్యకా పరమేశ్వరి కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వైసిపి ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె రాజు పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి అండగా నిలవాలని కళింగ వైశ్య సభ్యులను అభ్యర్థించారు. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు దాలిరాజు,అద్దపరపు రవిచంద్ర, పొట్నూరి నాగరాజు,భోగి సాయిరాం, గంపలి మధుసూ ధనరావు, సభ్యులు ప్రకాష్, ఎపి రావు పాల్గొన్నారు.

# కార్మికోద్యమానికి ఊపిరి పోసిన దొడ్డి రామునాయుడు

## 41వ వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి- అనకాపల్లి

విశాఖ జిల్లాలో కార్మికోద్యమానికి కీర్తిశేషులు దొడ్డి రామునాయుడు ఊపిరి పోశారని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. సిపిఎం ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా పని చేసిన కామ్రేడ్ దొడ్డి రామునాయుడు 41వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్ర పటానికి లోకనాథం తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ నాడు పుచ్చలపల్లి సుందరయ్య ప్రోద్భలంతో విశాఖ జిల్లాలో సిపిఎం విస్తరణకు దొడ్డి రామునాయుడు విశేషమైన కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన తుదిశ్వాస వరకూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం పరితపించారన్నారు. ఆయన నిరుపేద కుటుంబంలో పుట్టి నిరుపేదగా జీవితాన్ని గడుపుతూనే కేన్సర్ వ్యాధికి గురయ్యారని తెలిపారు. అయినా ఎక్కడా వాటిని పట్టించుకోకుండా సిపిఎంని జిల్లాలోనే కాకుండా అనకాపల్లి గ్రామీణ ప్రాంతంలో విస్తరించడంలో ఆమోఘమైన సేవలందించారని తెలిపారు. పార్టీ బలోపేతానికి నివాసం వుంటున్న తన ఇంటిపైనే విద్యార్థులకు ట్యూషన్ సెంటర్లను నిర్వహించారని చెప్పారు. విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించడంలో కృషి చేస్తూనే, కామ్రేడ్ ఎ.బాలకృష్ణ, మళ్ళ సత్యన్నారాయణ లాంటి నేతలను తయారు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, వి.వి శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, ఎ.రాజు, నాయకులు కె.ఈశ్వరరావు, కె.తెల్లయ్యబాబు, నూకఅప్పారావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.



రామునాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు



వెంకట అప్పారావు మాతృమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

### ఉత్తమ సేవలకు ఘన సత్కారాలు

ప్రజాశక్తి- మునగపాక : ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సేవా సంస్థ ద్వారా ఉత్తమ సేవలు అందించిన ముగ్గురికి మంగళవారం రాత్రి ఘన సత్కారం చేశారు. సత్యసాయి సేవా సమితి ద్వారా పలుమార్లు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసిన కసింకోట వాస్తవ్యులు పరమేశ్వరరావును, తోసా ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాండ్రేగుల వెంకట అప్పారావు, స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఏబీఎన్ మూర్తి తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సత్యసాయి డిఓ టి వెంకటరెడ్డి నాయుడు, సరిగా శివ గణేష్, వెంకటరమణ, మల్ల అప్పలనాయుడు, చిన్న రమణ , కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఎండ వేడి నుండి రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- కశింకోట

ఎండ వేడి నుండి రక్షణకు తగిన జాగ్రత్తలు పాటించాలని కశింకోట మండలం తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్ అన్నారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉంటే గొడుగు వాడాలని, కాటన్ దుస్తులు ధరించాలని, తలపై టోపీ లేదా జేబు రుమాల వేసుకోవాలని చెప్పారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి తల తిరగడం, జ్వరం, మత్తు ఉంటాయని, ఈ సమయంలో చల్లని ప్రాంతంలో ఉంచాలని, చల్లని నీటితో శరీరమంతా గుడ్డతో తుడవాలని, ఫ్యాన్ కింది వుంచాలని, అవసరమైతే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, మజ్జిగ తాగితే ఆరోగ్యానికి మంచిదని చెప్పారు.



డాక్టర్ రమేష్

## ఫార్మా ప్రమాదాలపై జెసికి సిఐటియు ఫిర్యాదు

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ ఫార్మాసిటీలోని ఎపిటోరియా, అల్కలీ మెటల్స్ పరిశ్రమల్లో ఆదివారం జరిగిన ప్రమాదాలపై సమగ్రమైన విచారణ చేసి, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జాయింట్ కలెక్టర్ జాహ్నవికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వివి శ్రీనివాసరావు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వలన ప్రమాదాలు జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయపడ్డ కార్మికులందరికీ మెరుగైన వైద్యం అందించాలని, పనిపై శిక్షణ ఇవ్వాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, భద్రతా ప్రమాణాలు పాటించాలని డిమాండ్ చేశారు. అధిక పని ఒత్తిడి, అధిక పనిగంటలు వలన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన ప్రమాదాల్లో కార్మికులు తమ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రమాదాల్లో గాయపడ్డ కార్మికులు పూర్తిగా కోలుకునే వరకు వేతనం, నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులతో సమగ్ర విచారణ చేయించి యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### వైభవంగా ఉగాది ఉత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పెంటకోట హాల్లో మంగళవారం వైభవంగా ఉగాది ఉత్సవాలు జరిగాయి. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ హాజరై మాట్లాడారు. తెలుగు తొలి పండగ ఉగాది ఉత్సవాలు బెస్ట్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలుగు సంస్కృతిని మన పిల్లలు అలవాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షులు నర్సింగరావు, చైర్మన్ పిఎస్.అప్పారావు, అధ్యక్షులు బిఎస్ఎంకె జోగి నాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్నికాన శ్రీనివాసరావు, డైరెక్టర్లు ఆడారి ప్రేమ్‌కుమార్, పీలా రామకృష్ణ, కర్రి మల్లేశ్వరరావు, కె.జగ్గారావు, రామకృష్ణ, బుద్ధ రాజు, సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు పూర్తి చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు

ప్రజాశక్తి -అనకాపల్లి

ప్రభుత్వ అధికారులు స్పందించి తక్షణమే అనకాపల్లి నాయుళ్ల వీధి నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు వరకు అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం నాయుళ్ళ వీధిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సందర్భంగా నాయకులు బొట్ట చిన్ని యాదవ్ మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల బిజీలో ఉంటే అధికారులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే ప్రజల సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. రోడ్లను శుభ్రం చేయడానికి కూడా ఎలక్షన్ కోడ్ అడ్డు వస్తుందా అన్నారు. ఈ రోడ్లపై పైపులైన్స్ వేసి రోడ్లను తవ్వేసి వాటిని సరిగా కప్పకుండా వదిలేయడం వలన రోడ్డు మీద మట్టి దిబ్బలు ఏర్పడి దుమ్ము ధూళి తేలిపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, బొబ్బిలి గోవిందరాజులు, ముగడ అప్పారావు, వై సాయిబాబా, గంట శివ, జోగిరాల శ్రీను, లక్ష్మీ డ్రాప్ దినేష్ పాల్గొన్నారు.



డాక్టర్ శంకర్ చీలను సత్కరిస్తున్న డైట్ కళాశాల అధికారులు

### సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇంజినీరింగ్ విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విఆర్ శంకర్ సూచించారు. స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు "లేటెస్ట్ స్కినారియోస్ ఇన్ సివిల్ వాటర్ రిసోర్సెస్ అండ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్" పై గెస్ట్ లెక్చర్ జరిగినది. దీనికి ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ విఆర్ శంకర్ చీల మాట్లాడుతూ క్లాస్ రూమ్ లెర్నింగ్ కు బదులుగా సివిల్ ఇంజనీరింగ్‌ను ప్రకృతి నుంచి నేర్చుకోవాలన్నారు. ఆశయాలను చేరుకునే వరకు మీ ఆలోచన విధానంలో మార్పులు ఉండకూడదన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠ రావు, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎ దేవి ప్రసాద్ మాట్లాడుతూ మాడ్ ఫ్లో, హైడ్రోస్, శాప్ వంటి లేటెస్ట్ సివిల్ ఇంజనీరింగ్ టూల్స్‌ని మనం మరింత ఆధునికంగా పొందడంలో మనల్ని మనం ఏవిధంగా సన్నద్ధం చేసుకుంటాం అనే దాన్నిబట్టి విద్యార్థుల భవిష్యత్తు ఉంటుందన్నారు. స్టూడెంట్ చాప్టర్ కన్వీనర్ హేమంత్ కుమార్ అనంతరం డాక్టర్ విఆర్ శంకర్ చీలను సివిల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, స్టూడెంట్ చాప్టర్ కన్వీనర్ హేమంత్ కుమార్ జ్ఞాపిక అందించి సాలువాతో సన్మానించారు.

### 'సెయింట్ జాన్స్'లో రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాలలో విద్యార్థుల చేత రంజాన్ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ బత్తిన నోబుల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సర్వ మానవ సమానత్వం కలిగి ఉండాలని, అన్ని మతాలు గౌరవించాలని, ఈ లక్షణాలు విద్యార్థి దశ నుండి అలవర్చుకోవాలని సూచించారు. రంజాన్ వేషధారణతో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ రూపానంద, సాజిద్, అకడమిక్ ఇన్‌ఛార్జ్ రూపానంద, విద్యార్థులు పాల్గొన్నారు.




రంజాన్ వేడుకల్లో పాల్గొన్న సెయింట్ జాన్స్ స్కూల్ చిన్నారులు

## బొగ్గు, ఫ్లై యాష్ కాలుష్యంతో ఇబ్బందులు

### పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పైడివాడ అగ్రహారం గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి-సబ్బవరం

లంకెలపాలెం నుండి సబ్బవరం వెళ్లే రోడ్డులో తడి ఫ్లై యాష్, బొగ్గు తరలించే లారీ వల్ల వస్తున్న కాలుష్యం వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యపై పలు మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా కనీసం పట్టించుకునే నాథుడే లేరని వాపోయారు.

బొగ్గు, ఫ్లై యాష్‌ను లారీల్లో అధిక మొత్తంలో లోడు చేసుకొని లంకెలపాలెం నుండి సబ్బవరం రోడ్డులో అతివేగంతో ప్రయాణిస్తున్నాయి. ఈ క్రమంలో రోడ్డుపై బొగ్గు, తడి ఫ్లై యాష్ పడుతున్నాయి. బొగ్గు, ఫ్లైయాష్ రెండు కలిసిపోయి లారీలు వెళ్లే వేగానికి పైకి లేసి వాహనదారుల మీద పడుతుంది. దీంతో ఈ మార్గంలో వాహనదారులు ప్రయాణం చేయాలంటే బెంబేలెత్తిపోతున్నారన్నారు. ఈ దుమ్ము ధూళి ఎగిరి వాహనదారుల కళ్లల్లో పడడంతో రోడ్డుపైన ఉన్న గోతులు కనిపించటం లేకపోవడంతో పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రోడ్డులో బైక్‌ల మీద వెళ్తూ నిత్యం ప్రమాదాలకు గురై హాస్పటల్ పాలవుతున్నారని పైడివాడ అగ్రహారం మాజీ ఎంపిటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గి నాయుడు, మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామస్తులు బొగ్గు, ఫ్లై యాష్ లారీలను పలుమార్లు నిలుపుదల చేసి నిరసన తెలియజేసినా ఫలితం శూన్యమన్నారు. పోలీసులు మాత్రం వాహనాలను ఆపడానికి వీలు లేదని చెప్పి వాటిని పంపించేస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయమై పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు కూడా గ్రామస్తులు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ రోడ్డులో దుమ్ము, ధూళి వల్ల అనేక రోగాల బారిన పడుతున్నామని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అయితే అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని ఈ సమస్యపై దృష్టి పెట్టడం లేదని వారు వాపోయారు. అధిక లోడుతో ప్రయాణించే వాహనాలపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, తమ బాధ్యతగా తీసుకొని తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన పోగు పడిన ఫ్లై యాష్

# ఓటర్ల జాబితాలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఓటర్ల జాబితాలో అవకతవకలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వివరణ ఇవ్వాలని, ఎన్నికల కమిషన్ తక్షణమే చర్యలు తీసుకొని ఎన్నికలకు ముందుగానే సరైన జాబితా విడుదల చేయాలని అనకాపల్లి టిడిపి, బిజెపి, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, బిజెపి నాయకులు పొన్నగంటి అప్పారావుతో కలిసి బుధవారం కొణతాల విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగాలంటే ఓటర్ జాబితా సక్రమంగా ఉండాలని, కాని ప్రస్తుతం రాష్ట్రంలో అటువంటి పరిస్థితి లేదని పేర్కొన్నారు. 2024 జనవరిలో విడుదలైన కొత్త జాబితాలో కొన్ని వేల ఓట్లు డబల్ ఎంట్రీ అధికార పార్టీకి చెందినవి నమోదయ్యాయన్నారు. నర్సీపట్నానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన 294 ఓట్లు అనకాపల్లిలో నమోదు కావడం విశేషమన్నారు. డబల్ ఎంట్రీలు 4828, ఒకే డోర్ నెంబర్‌పై 5278, డోర్ నెంబర్ లేకుండా 660 ఓట్లు నమోదైనట్లు చెప్పారు. దీనిపై జిల్లా, రాష్ట్ర, కేంద్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ ఓటర్ల జాబితా అవకతవకలపై 18సార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా నేటికీ చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై తక్షణమే కలెక్టర్ పత్రిక ముఖంగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

# సరైన ఆధారాలతో ఇస్తే చర్యలు తీసుకుంటాం : కలెక్టర్ రవి

అనకాపల్లి : ఓట్లు నమోదు అవకతవకలపై సరైన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీ నేతలతో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశం జరిగింది. ఎన్నికలు నిబంధనలు హెూమ్ ఓటింగ్ పోస్టల్ బ్యాలెట్ పలు అంశాలపై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు, అనకాపల్లి నియోజకవర్గం పరిధిలో డబుల్ ఎంట్రీ ఓట్లు 4828 ఓట్లు సింగిల్ డోర్ నెంబర్ 5278 డోర్ నెంబర్ లేకుండా 666 ఓట్లు ఉన్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దీనిపై కలెక్టర్ పటాన్ శెట్టి రవి స్పందిస్తూ ఎన్నికల కమిషన్ విధి విధానాలను అనుసరించి ప్రతి ఒక్క ఫిర్యాదును పరిష్కరించామని, మీరు సరైన ఆధారాలతో ఫిర్యాదు చేసిన యెడల పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు ఆర్ శంకర్ రావు, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పార్లమెంట్ కార్యాలయం కార్యదర్శి బొలిశెట్టి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు గొర్లి సూరిబాబు, కాంగ్రెస్ నాయకులు కాళ్ల వెంకట సత్యనారాయణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


పిల్లలకు ఆట వస్తువులు అందిస్తున్న దృశ్యం

## ఆటిజం పిల్లలకు ఆట వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఆటిజం పిల్లలకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంధ ఉపాధ్యాయులు కొర్రుప్రోలు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆటిజం వ్యాధి వలన పిల్లలకు మాటలు సరిగా రాకపోవడం, రుచి వాసన తెలియకపోవడం ఉంటుందని చెప్పారు. తల్లి గర్భం నుంచి ఈ ఆటిజం రాకుండా ఉండాలంటే వైద్య పరీక్షలు, పోషక ఆహారం తీసుకోవాలని, ఒత్తిడికి గురికాకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెంబర్-2 పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యవతి, రామునాయుడు, శ్రీనివాసరావు, రమణమ్మ , దీప పాల్గొన్నారు.

## బాల్యవివాహాలను అరికట్టడం అందరి బాధ్యత

ప్రజాశక్తి-అనకాపల్లి : బాల్య వివాహాలను అరికట్టడంలో అందరూ బాధ్యత వహించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఏసి డిపిఓ శశికళ అన్నారు. మండలంలోని బవులవాడ ఆర్‌విఎస్ నగర్ అంగన్వాడి కేంద్రంలో బుధవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు వెంకటలక్ష్మి, కోట లక్ష్మి కష్ణవేణి, ప్రధానోపాధ్యాయులు రాము, విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది ఎం ఎస్ కె పద్మ విజయ్ కుమార్, ఆరోగ్య సిబ్బంది అంగన్వాడీ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.


## పోస్టల్ బ్యాలెట్ తేదీని మార్చాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విధులు నిర్వహించే ఉద్యోగులు తమ ఓటుని పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేందుకు మే 5, 6, 7, 8, తేదీల్లో ఉద్యోగులు తమ నియోజకవర్గ పరిధిలోని ఫెసిలిటేసన్ సెంటర్లలో వినియోగించుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందని, అయితే మే 5న రాష్ట్ర వ్యాప్తంగా నీట్ పరీక్ష ఉన్నందున కొంతమంది ఉద్యోగుల పిల్లలు పరీక్ష రాసే అవకాశం ఉన్నందున, పిఓ, ఏపీఓ, మైక్రో అబ్జర్వర్ల కోసం కేటాయించిన మే 5వ తేదీని మార్చాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనాని కోరారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో వినతిపత్రం అందచేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మెప్మా ఆధ్వర్యంలో విధులు నిర్వహించే సీఎల్‌ఆర్పీలు, ఆర్పీలపై ఒత్తిడి తెచ్చి కొన్ని చోట్ల మున్సిపాలిటీ, కార్పొరేషన్లల్లో పొదుపు సంఘాల మహిళలను ప్రభావితం చేసేందుకు అధికార పార్టీ నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. దానిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. నూతనంగా వచ్చిన చేర్పుల ఓటర్ల లిస్టుల్లో ఓటరు పేర్లు ఉన్నాయని, వాటిపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మన్నారు. ఎన్నికల అధికారిని కలిసిన వారిలో రవి తేజా ఉన్నారు.

## టిడిపి నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని కొండకర్ల గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు సుంకర జగదీశ్వరరావు, సానా వీరునాయుడు, నడిపింటి రాజబాబు, పచ్చికూర నాగేషు తదితరులు బుధవారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు సమక్షంలో వైసిపిలో చేరారు. వారికి కన్నబాబురాజు చేతుల మీదుగా పార్టీ కండువాలు వేసి సాధారంగా స్వాగతం పలికారు. ఎన్నికలలో వైసిపి గెలుపునకు పనిచేయాలని ఆయన కోరారు.


వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాజు

# కూటమి నాయకుల ప్రచారం


మునగపాక మండలంలో ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

ప్రజాశక్తి- మునగపాక

మండలంలోని నరేంద్రపురం, చెర్లోపాలెం, మడకపాలెం గ్రామాలలో బుధవారం ఎలమంచిలి నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు సీఎం రాజేష్ తదితరులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ సుమారు 15 సంవత్సరాల నుంచి ఎటువంటి పదవులు చేపట్టకుండా నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తున్నానని తెలిపారు. కన్నబాబురాజు 15 సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా ఉండి దాచుకోవడం, దోచుకోవడం తప్ప నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో గాజు గ్లాసు, కమలం గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కొండకర్ల ఆవ అభివృద్ధికి కృషి చేస్తా

అచ్యుతాపురం : కొండకర్ల ఆవను పర్యాటక రంగంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ అన్నారు. కొండకర్ల గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఎల్లారమ్మ ఉత్సవంలో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

### జివిఎంసి 84వ వార్డులో ప్రచారం

అనకాపల్లి : ప్రజ జీవన ప్రమాణాలు పెరగాలంటే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌లను గెలిపించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీష్ ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలోని 84వ వార్డు (మున్సిపల్ పాత 12వ వార్డు) గొల్లవీధిలో ఆ వార్డు టిడిపి ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు, నాయకులు బోడి వెంకటరావు ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుప్పిలి జగన్ కరణం శ్రీనివాసరావు సిరసపల్లి ఆదిబాబు మడగల శ్రీనివాసరావు సారిపల్లి శ్రీనివాసరావు పిళ్ళా తారకేష్ ఇల్లపు శ్రీనివాసరావు జనసేన బిజెపి తెలుగుదేశం కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైసిపి నేతల ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -అనకాపల్లి : రాష్ట్రంలో జగనన్న సంక్షేమ రాజ్యం రావాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్ కుమార్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బుధవారం జివిఎంసి 80వ వార్డు గవరపాలెంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, శ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానం ఛైర్మన్ కొణతాల మురళీకృష్ణ నేతృత్వంలో ఈ ప్రచారం జరిగింది. ముందుగా గవరపాలెం శ్రీ గౌరీ పరమేశ్వరులను, కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి అనంతరం శతకంపట్టు మొదలుకొని విజ్ఞాన సమితి వరకు ప్రచారంలో పాల్గొన్నారు. మహిళలు, పెద్దలు, స్థానిక నాయకులు బూడి ముత్యాలనాయుడు, భరత్‌కుమార్‌లకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి. సత్యవతి, వైసిపి నాయకులు పలకా రవి, విల్లూరి శివసూరి, కెఎం.నాయుడు, బుద్ద నర్సింహరాజు, డి. నర్సింగరావు, బొడ్డేడ శివ, ఆళ్ళ నాగేశ్వరరావు, మున్నూరు శ్రీను, కాండ్రేగుల యశ్వంత్, లక్ష్మీనారాయణ, దాడి నారాయణరావు, ఉగ్గిన అప్పారావు, వేగి త్రినాథ్, కర్రి రుద్రి నాయుడు, నడిశెట్టి మధు, గైపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.


మృతి చెందిన మేక పిల్లలు

## వీధి కుక్కల దాడిలో 4 మేక పిల్లలు మృతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వెంకటరాజుపురంలోని బుధవారం వీధి కుక్కల దాడిలో నాలుగు మేక పిల్లలు మృతి చెందాయి. గ్రామంలో వీధి కుక్కల బారిన పడి, గడిచిన రెండు రోజుల నుంచి ఇప్పటివరకు 15 వరకు మేక పిల్లల మృతి చెందినట్లు రైతులు చెబుతున్నారు. పంచాయితీ అధికారులు వీధి కుక్కల బారి నుంచి పెంపుడు జీవాలను కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- అనకాపల్లి : గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, గతంలో ఆగిన ఆర్‌ఎంపి వైద్య శిక్షణ తిరిగి మరింత ఉన్నతంగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని టిడిపి, బిజెపి, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సమావేశం గవరపాలెం కొణతాల సుబ్రహ్మణ్యం ఏసి కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కొణతాల మాట్లాడుతూ తమ ప్రభుత్వం రాగానే ముందుగా గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి తనయుడు రుత్విక్, సంఘం నాయకులు కొణతాల రాజు, ఎన్ఎల్.రావు, సుగుణేశ్వరి, ఆదారి శ్రీనివాసరావు, ఈదరాడ ఈశ్వరరావు, అలకరాజు, వీరభద్రరావు, రమేష్ పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో మళ్ల లక్ష్మీనారాయణ దంపతులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ఎండలు మండుతూ వేసవి తాపంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రయాణికులకు దాతలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు దాహార్తిని తీర్చేందుకు దోహదపడతాయని చెప్పారు.

# గ్రామాల్లో టిడిపి అభ్యర్థుల ప్రచారం



ప్రచారం చేపడుతున్న పైలా ప్రసాదరావు

**ప్రజాశక్తి - చీడికాడ:** మండలంలోని ఎల్.బి.పట్నం గ్రామంలో అసెంబ్లీ నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాదరావు.ఇంటింటి కి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పధకాలపై ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవు తుందన్నారు. ప్రచారంలో ఆయనతోపాటు మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసి నాయుడు, క్లస్టర్ ఇంచార్జి పేరపు కొండబాబు, రెడ్డి రాము, డోకల అప్పలనాయుడు పాల్గొన్నారు.

**కోటవురట్ల:** కూటమి అభ్యర్థులను గెలిపించాలని టిడిపి అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు బుధవారం పందూరు రామచంద్రపురం గ్రామాలలో విస్తతంగా పర్యటించారు, కార్యక్రమానికి హాజరైన సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి, పాల్గొన్నారు సందర్భంగా అనిత మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని ప్రధానంగా మండలాన్ని పట్టించుకున్న నాయకులే లేకపోవడంతో పూర్తి స్థాయిలో వెనుకబడిపోయిందని దారుణ ఎన్నికల్లో టిడిపి బిజెపి జనసేన అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటికి తిరిగి కోరారు, గ్రామస్తులు ప్రతిస్థాయిలో ఆమెకు బ్రహ్మరథ పట్టారు, పొందూరు గ్రామంలో వైసిపి నాయకులు మాజీ ఎంపీటీసీ సభ్యులు చీకట్ల భాస్కరరావు ఆమె సమక్షంలో పార్టీలో చేరారు కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డం బుజ్జి, టిడిపి జిల్లా నాయకులు కాశి నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీను, పలువురు టిడిపి జనసేన పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అనిత

# వాలంటీర్లు మూకుమ్మడి రాజీనామా

**ప్రజాశక్తి - చీడికాడ:** మండలంలోని బి.సింగవరం గ్రామానికి చెందిన ఐదుగురు వాలంటీర్లు రాజీనామా చేశారు. వాలంటీర్లు దాడి దివ్య, పీల మహాలక్ష్మి నాయుడు, కొణతాల సింధు, పంచదారల భువనేశ్వరి, మల్లా జయలక్ష్మిలు బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉమామహేశ్వరికి రాజీనామా పత్రాలు అందజేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదనే నిబంధనలో భాగంగానే విధులకు రాజీనామా చేసినట్లుగా వారు తెలిపారు.

**మునగపాక:** మునగపాక మండలంలోని మునగపాక, తిమ్మరాజుపేట, చెర్లోపాలెం, పాటిపల్లి, అరబ్బుపలెం, నాగులపల్లి, కాకరపల్లి గ్రామాలకు చెందిన 151 మంది గ్రామ వాలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను స్థానిక పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మన్మధరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ నేటి వరకు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించామని చెప్పారు. అయినప్పటికీ తెలుగుదేశం అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాలంటీర్ల వ్యవస్థను, వాలంటీర్లను నీచ పదజాలంతో దూషిస్తున్న కారణంగా మనస్తాపం చెంది మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నామని, తమ రాజీనామాలను ఆమోదించాలని కోరారు.

**రోలుగుంట:** మండలంలోని కొవ్వూరు గ్రామానికి చెందిన 12 మంది వాలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపిడిఒకు రాజీనామాలను లేఖలను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ప్రతిపక్షాలు తమను ప్రజాసేవ చేయకుండా అడ్డుకుంటున్నారన్నారు. దీంతో తామంతా మూకుమ్మడిగా రాజీనామా చేసినట్లు తెలిపారు.




రాజీనామా లేఖను చూపుతున్న వాలంటీర్లు



భజన గీతాలు ఆలపిస్తున్న భజన బందం సభ్యులు

## ఉపమాకలో సప్తాహం ప్రారంభం

**ప్రజాశక్తి-నక్కపల్లి:** మండలంలోని ఉపమాక మెరక వీధి రామాలయంలో శ్రీనివాసా భజన భక్త సమాజం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం సప్తాహం (భజన ) కార్యక్రమం ప్రారంభించారు. ఈనెల 17 న శ్రీరామనవమి పురస్కరించుకుని సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా 7 రోజుల పాటు భజన కార్యక్రమం చేపట్టినందుకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ముందుగా శ్రీనివాసా భజన భక్త సమాజ బృందం సభ్యులు, గ్రామస్తులు గ్రామ తిరు వీధిలో శోభాయాత్ర నిర్వహించి భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 10 వ తేదీ బుధవారం ఉదయం 6 గంటల నుండి ప్రారంభమైన భజన 17 వ తేదీ వరకు కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.




అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

## టెన్త్ విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి- నక్కపల్లి:** మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఎలక్ట్రానిక్స్ అభ్యసిస్తున్న విద్యార్థులకు బుధవారం హెచ్ఎం రామప్రతాప్‌రావు, వృత్తి విద్యా ఉపాధ్యాయులు ఎం.సాయిచందు ఆధ్వర్యంలో ఇంటర్న్ షిప్‌పై అవగాహన కల్పించారు. టెక్నికల్ విద్యను అభ్యసించడంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు త్వరిత గతిన లభిస్తాయన్నారు. విద్యార్థులు వృత్తి విద్యపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. పాయకరావుపేటలో విజన్ ప్రైవేట్ ఐటిఐను విద్యార్థులతో కలిసి సందర్శించారు. వృత్తి విద్య కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



స్వాధీనం చేసుకున్న పోలీసులు

## 900 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని కంఠవరం గ్రామ శివారులో బుధవారం ఉదయం సారా బట్టిలపై దాడులు చేసినట్లు గొలుగొండ ఎస్సై బి.కృష్ణారావు తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి ఉపయోగించే 900 లీటర్ల బెల్లం పులుపును, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశామన్నారు. గ్రామాల్లో నాటుసారా విక్రయించినా, తయారు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

# హోమ్ ఓటింగ్‌పై అవగాహన

**ప్రజాశక్తి -నక్కపల్లి:** హెూమ్ ఓటింగ్ పై ఓటర్లకు అవగాహన కల్పించాలని పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే గీతాంజలి సూచించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం ఎలక్షన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఓటరు గృహం వద్ద నుండే ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈనెల 15, 16వ తేదీల్లో పిఓ, ఏపీఓలకు ఇవ్వనున్న శిక్షణ పై చర్చించారు. ఈ శిక్షణకు అందరూ హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఓ లు, ఎంపీడీవోలు,హెచ్ డీటిలు, ఎలక్షన్ డిటి తదితరులు పాల్గొన్నారు .



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి



చెక్కును ఇస్తున్న నాయకులు

## 22న నామినేషన్ దాఖలు

**ప్రజాశక్తి-చీడికాడ:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మాడుగుల నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా చీడికాడ మండల కేంద్రానికి చెందిన అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావుని ప్రకటించారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బొడ్డు శ్రీనివాసరావు నియోజకవర్గంలో స్థాయి ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈనెల 22 వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. నామినేషన్‌కు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న నాయకులు

## ఆలయానికి విరాళం

**ప్రజాశక్తి-మాడుగుల:** మాడుగులలో సీతారామస్వామి దేవాలయానికి రాయపురెడ్డి కృష్ణ ఆర్థిక సాయం అందించారు. మాడుగుల కొబ్బరి తోట వీధిలో ఉన్న ప్రాచీన సీతారామ స్వామి వారి దేవాలయం పునర్నిర్మాణం జరుగుతుంది. సీతారామస్వామిని దర్శించుకున్న మాడుగుల నియోజకవర్గ జనసేన సమన్వయకర్త, కొబ్బరి తోట వీధి యూత్ సభ్యుల ఆధ్వర్యంలో రాయపు రెడ్డి కృష్ణ తన నిధులు నుండి పది వేలు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బ మహేష్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న కార్యదర్శి

## చలివేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్:** మండలంలోని కవగుంట గ్రామంలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఎస్.ఏ స్వామి తెలిపారు. వేసవికాలం దృష్ట్యా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి వరహాలు, పి.రాము, ఆర్.రమణ, వీఆర్ఏ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా శ్రీరామ్మూర్తి

**ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:** నర్సీపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రుత్తల శ్రీరామ్మూర్తి పేరును పార్టీ అధిష్టానం ప్రకటించింది. ప్రస్తుతం ఈయన పార్టీ జనరల్ సెక్రటరీ(సంస్థాగత వ్యవహారల ఇన్ చార్జ్)గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ, పార్టీకి తాను చేసిన సేవలను గుర్తిస్తూ అభ్యర్థిగా ప్రకటించిందని ఆయన తెలిపారు. విజయానికి కృషి చేయాలన్నారు.

## గ్రూప్ 2 మెయిన్స్‌కు 43 మంది అర్హత

**ప్రజాశక్తి పాడేరు :** రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్- 2 ప్రిలిమ్స్‌లో 43 మంది గిరి పుత్రులు విజయం సాధించారని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఐటిడిఏ ఆధ్వర్యంలో వేపగుంట వైటీసీలో సివిల్స్ శిక్షణ పొందుతున్న 60 మంది అభ్యర్థులలో 59 మంది అభ్యర్థులు ఇటీవల నిర్వహించిన గ్రూప్ 2 ప్రిలిమ్స్ కు హాజరయ్యారు. వీరిలో 43 మంది మెయిన్స్ కు అర్హత సాధించాలని పిఓ చెప్పారు. అర్హత సాధించిన అభ్యర్థులకు, శిక్షణ అందిస్తున్న 21వ సెంచరీ సంస్థ నిర్వాహకులు ధరణికు పివో అభినందనలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తి కొనసాగించి గ్రూప్ -2 మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## జనసేనలో పలువురు చేరిక

**ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:** నర్సీపట్నం మున్సిపాలిటీ 4వ వార్డు కాపువీధికి చెందిన 60 వైసీపీ కుటుంబాలు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. మంగళవారం సాయంత్రం కాపువీధిలో మున్సిపాలిటీ జనసేన అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ అధ్యక్షతన జనసేన పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వీరంతా జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు వీరందరికి పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారిశెట్టి రాజా, కొప్పాక కళ్యాణ్, నాలుగు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.



## నేడు రంజాన్

**-విద్యుత్ కాంతులతో మసీదుల అలంకరణ**

**ప్రజాశక్తి-విశాఖపట్నం :** ముస్లిముల పవిత్ర పండగ రంజాన్‌ను గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం, ఈద్-ఉల్-ఫితర్‌కి ఎంతో ప్రాముఖ్యత ఉంది. దీన్నే ఈద్ లేదా రంజాన్ అంటారు. ఈ పండుగ పవిత్ర రంజాన్ మాసం ముగింపును సూచిస్తుంది. ఈ నెలలో ముస్లింలందరూ కఠిన ఉపవాస దీక్షలను పాటిస్తారు. నమాజ్ చేసే సమయంలో పవిత్ర ఖురాన్ చదివి, అల్లాను ఆరాధిస్తారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం, రంజాన్ మాసం తొమ్మిదో నెల. పదో నెల షవ్వాల్. ఈ నెల ప్రారంభ రోజున ప్రపంచవ్యాప్తంగా రంజాన్ పండుగను జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఈసారి ఈద్ జరుపుకోవడానికి అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో మసీదులను ముస్లిములు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ నియోజకవర్గంలో ముస్లిములు అధిక సంఖ్యలో ఉన్నారు. వారంతా భక్తి శ్రద్ధలతో రంజాన్ ఉపవాస దీక్షలు పాటించారు. నగరంలోని పలు ప్రాంతాల్లోనూ, పెదగంట్యాడ మండలంలో ఉన్న ముస్లిం గ్రామాల్లో రంజాన్‌ను వేడుకగా నిర్వహిస్తున్నారు.



అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్

## పోస్టల్ బ్యాలెట్ పై అవగాహన

**ప్రజాశక్తి -కోటవురట్ల:** రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వృద్ధులకు, వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగం కల్పించడంపై బుధవారం మండల సమావేశం మందిరంలో ఎన్నికల సిబ్బందికి తహసిల్దార్ వెంకటరమణ అవగాహన కల్పించారు. 85 సంవత్సరాల దాటిన వృద్ధులకు, అదేవిధంగా దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించేందుకు సిబ్బంది వారిని గుర్తించాల్సి ఉందని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అందజేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డిప్యూటీ తహసిల్దార్ అన్నాజీరావు, డివిజనల్ ఇంజనీర్ కుమార్ రాజా, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## టోఫెల్ ప్రైమరీ సంసిద్ధత పరీక్ష

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** మండలంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో బుధవారం ప్రాథమిక తరగతి విద్యార్థులకు ఒఎంఆర్ ద్వారా టోఫెల్ ప్రైమరీ సంసిద్ధత పరీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించి ఆడియో ఫైల్స్‌ను పాఠశాలల్లోని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, స్మార్ట్ టివిల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు జిల్లా టోఫెల్ మోడల్ అధికారి, స్థానిక ప్రభుత్వ డైట్ సీనియర్ అధ్యాపకులు జిజిఎస్ నాగేశ్వరరావు, ఎంఇఒ ఎం శివరా స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి టోఫెల్ పరీక్ష నిర్వహణను పరిశీలించారు. నాల్గో వార్డు జె వి అగ్రహారం, చిన ఉప్పాడ, ఒకటో వార్డు సంతపేట డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ప్రాథమిక పాఠశాల, బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల లో పరీక్ష నిర్వహణను డైట్ అధ్యాపకులు ఎల్ సుధాకర్, సోమయాజులు, త్రినాథరావుపరిశీలించారు. స్కానర్ ద్వారా వాల్యుయేషన్ జరుగుతుందని డైట్ ప్రిన్సిపల్ ఎం జ్యోతి కుమారి తెలిపారు

# సైబర్ మోసగాడి అరెస్టు

**ఉద్యోగాల పేరుతో యువతకు నయవంచన**
**పలువురి నుంచి రూ.లక్షల్లో వసూలు**
**కేసు ఛేదించిన సిఐడి పోలీసులకు అభినందన**

**ప్రజాశక్తి - ఆరిలోవ :** ఆన్‌లైన్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకొని ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న నిరుద్యోగ యువతి, యువకులను మోసం చేసి, డబ్బులు వసూలు చేసిన ఒక సైబర్ మోసగాడిని సాంకేతిక పరిజ్ఞానంతో సిఐడి సైబర్ విభాగం ఎట్టకేలకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం పైనాపిల్ కాలనీ సిఐడి ప్రాంతీయ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో సిఐడి అడిషనల్ ఎస్‌పి రవివర్మ ఆధ్వర్యంలో సిఐడి ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ వివరించారు.

విశాఖపట్నం జిల్లా పెందుర్తి, జుత్తాడ గ్రామానికి చెందిన గిన్ని గోపి, బిటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో మెషిన్ టెస్టింగ్ ఉద్యోగంలో చేరాడు. అక్కడ కొంతకాలం పనిచేసి మానేసాడు. తరువాత ఇంటర్నెట్‌లో లింక్డ్‌ఇన్ వెబ్‌సైట్‌లో జాబ్స్ కోసం దరఖాస్తు చేసుకునే వారి డిటైల్స్ తీసుకొని తన వాట్సాప్ ద్వారా కాంటాక్ట్ అయ్యి జాబ్ ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసేవాడు. ఈ విధంగా ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న నిరుద్యోగ యువతీ, యువకులే ధ్యేయంగా పెట్టుకొని వారి వద్ద నుంచి డబ్బులు వసూలుకు అలవాటు చేసుకున్నాడు. ఇదే విధంగా భీమిలిపట్నానికి చెందిన నిరుద్యోగ యువతిని ఆన్‌లైన్లో పరిచయం చేసుకొని ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి గూగుల్ మీట్ ద్వారా ఒక ఫేక్ ఇంటర్వ్యూ కండక్ట్ చేసి, ఫేక్ ఆఫర్ లెటర్ కూడా ఆమెకు పంపించాడు. ఆమె వద్ద నుంచి ఫోన్ పే ద్వారా దఫదఫాలుగా రూ 56,500 తన అకౌంట్‌కు వేయించుకున్నాడు. అదేవిధంగా నంద్యాల జిల్లాకు చెందిన ఒక నిరుద్యోగి యువతి నుంచి రూ 3.18 లక్షలు, తిరుపతికి చెందిన ఒక యువకుడు నుంచి రూ 30 వేలు, విశాఖకు చెందిన మణికంఠ వద్ద నుంచి రూ 34,750, మణికంఠ స్నేహితుడు సయ్యద్ అజీమ్ నుంచి రూ.23 వేలు వసూలు చేసాడు. ఇలా 17 మంది వద్ద నుంచి సుమారు రూ 8 .లక్షలు వసూలు చేసినట్లు గుర్తించారు. ఇదే తరహాలో తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల యువతి యువకుల నుంచి యుపిఐ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించారు. సైబర్ నేరాన్ని ఛేదించిన సిఐడి అడిషనల్ ఎస్‌పి రవి వర్మ, ఇన్‌స్పెక్టర్ వర ప్రసాద్, ఎస్‌ఐలు గోపాలరావు, సురేష్ బాబు, పిసిలు వెంకట రమణ, మహిళా పిసి ఎ.సరితలను సిఐడి అడిషనల్ డిజిపి సంజయ్ అభినందించారు.




విలేకర్ల సమావేశంలో వివరాలు తెలియజేస్తున్న సిఐడి అధికారులు)

**ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం**

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఐడి సైబర్ క్రైమ్ అనాలసిస్ అండ్ టాస్క్‌ఫోర్స్ టీం హెచ్చరించింది. నిరక్షరాస్యుల నుంచి పెద్ద హోదాల్లో ఉన్న వారు కూడా దీనిలో బాధితులుగా ఉన్నారన్నారు. ప్రజలు ఆన్‌లైన్ జాబ్ ఫ్రాడ్, ఆన్‌లైన్ ఇన్వెస్టిమెంట్, ఫేక్ ఆన్‌లైన్ లింక్ గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్లో వచ్చిన మోసపూరిత లింక్‌లను ఓపెన్ చేయవద్దని, అపరిచిత వ్యక్తుల మాయ మాటలు నమ్మి ఎటువటి డబ్బులు చెల్లించవద్దని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాల్లో మోసపోతే తక్షణమే 1930 టోల్ ఫ్రీ సెంటర్‌కు లేదా www.cybercrime.gov.in అనే వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి ఫిర్యాదు చేయాలన్నారు. దీనితో పాటు అందుబాటులో ఉన్న పోలీస్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

# వైసిపి నేతల ముమ్మర ప్రచారం

**ప్రజాశక్తి -కొత్తకోట:** చోడవరం నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడులను గెలిపించాలని కోరుతూ బుధవారం రావికమతం ఆ పార్టీ నాయకులు మండలంలో తొలిసారిగా మత్రివలస శివారు గొల్లలపాలెం గ్రామంలో ప్రచారాన్ని ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఎంపిపి పైల రాజు, వైసీపీ మండల శాఖ అధ్యక్షులు ముక్కా మహాలక్ష్మి నాయుడు, కంచిపాటి జగ్గారావు, గుమ్ముడు సత్యదేవ్ తదితరులు మాట్లాడుతూ, భవిష్యత్తులో మరిన్ని అబివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు వైసీపీని బల పర్చాలని కోరారు. తెలుగుదేశం పార్టీ పాలనలో జన్మభూమి కమిటీలకు ముడుపిలిస్తేనే గాని ప్రజలకు ఏ పథకాలు అందేవి కావన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అలా కాకుండా ప్రతి సంక్షేమ పథకం వాలంటీర్ల ద్వారా గడపగడపకు అందుతున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు జేశారు..ఈ కార్యక్రమం లో వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**అనకాపల్లిడెస్క్:** నర్సీపట్నం వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ బుధవారం నర్సీపట్నం మున్సిపాలిటీ 23వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుస్తూ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పేదల ఆర్థికాభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందించారన్నారు. రాజకీయాలు, కులాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న గణేష్

# 12 నుంచి నాటకోత్సవాలు

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** కళాభారతి, కీర్తిశేషులు పైడా కౌషిక్ నాటకోత్సవాలు - 2004, 19వ రాష్ట్రస్థాయి ఆహ్వాన సాంఘిక నాటికల పోటీలను ఈ నెల 12 నుంచి నిర్వహిస్తున్నామని వివిఎమ్‌డిఎ నాటకోత్సవాల అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు తెలిపారు. బుధవారం కళాభారతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాలనుంచి మొత్తం 40 ఎంట్రీలు వచ్చాయని, వాటన్నింటిని ప్రోగ్రాం కమిటీ సభ్యులందరూ అధ్యయనం చేసి 9 నాటికలను ఎంపిక చేశారని వివరించారు. మొదటి నాలుగు రోజులు, రోజుకు రెండు నాటికలు, చివరి రోజు 16వ తేదీన ఒక నాటిక ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఆ వెంటనే సిఎంఆర్ సౌజన్యంతో బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు.

వివిఎమ్‌డిఎ ట్రస్టీ, నాటకోత్సవాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ జిఆర్‌కె.ప్రసాద్ (రాంబాబు) మాట్లాడుతూ, ప్రదర్శించే ప్రతి నాటికకూ రూ.13 వేలు పారితోషికం ఇవ్వటానికి నిర్ణయించినట్లు తెలిపారు. పోటీలో గెలుపొందిన ఉత్తమ ప్రదర్శనకు రూ.18 వేలు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.15 వేలు, తృతీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.12 వేలు, చతుర్థ ఉత్తమ ప్రదర్శనకు రూ.10,000 నగదుతో పాటు జ్ఞాపికలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇవిగాక 12 వ్యక్తిగత బహుమతులు ఒక్కొక్కరికి రూ.1500, జ్ఞాపికలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మూడు జ్యూరీ బహుమతులు ఒక్కొక్కరికి రూ.1000 నగదుతో పాటు జ్ఞాపికలు అందిస్తామని చెప్పారు. ప్రోత్సాహక బహుమతుల క్రింద నాటికలలో పాల్గొన్న బాల, నటీనటులకు రూ.1000 నగదుతో పాటు జ్ఞాపికలు బహూకరించనున్నట్లు వివరించారు. నాటకోత్సవాల నిర్వాహకులు పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, అన్ని రోజులు నాటక ప్రదర్శనలకు ప్రవేశం ఉచితమని, వచ్చిన ప్రేక్షకులకు ప్రతిరోజు లాటరీ తీసి బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ ఆచార్య బాబివర్ధన్, ఎగ్జిక్యూటివ్ కన్వీనర్స్ బొడ్డేటి జగన్రావు, వి.నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న షిప్‌యార్డు యూనియన్ నాయకులు

## షిప్‌యార్డు సమస్యలపై డిఫెన్స్ కార్యదర్శికి వినతి

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :**

ఫ్లీట్ సపోర్ట్ వేస్సెల్స్ ప్లేట్ కటింగ్ షిప్‌యార్డు విశాఖ వచ్చిన సందర్భంగా డిఫెన్స్ కార్యదర్శి గిరిధర్ అరమనే అన్ని కార్మిక సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. షిప్‌యార్డులో ప్రధాన సమస్యలైన 5 ఎఫ్‌ఎస్‌ఎస్ షిప్‌లు షిప్ యార్డులో కట్టాలని, ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, మిగిలిన కార్మిక సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో షిప్ యార్డు సిఎండి హేమంత్ కత్రి, డైరెక్టర్లు, అన్ని యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.